**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**విజయవాడ**
**తేదీ : సెప్టెంబర్ 3, 2016**

**శ్రీయుత నారా చంద్రబాబునాయుడు గారికి,**
గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము.
విజయవాడ.

**ప్రచురణార్థం:** ఈరోజు సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాను. **– జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

ఆర్యా!

**విషయం: దీవిస్ ఫార్మాస్యూటికల్స్‌ఫ్యాక్టరీ నిర్మాణాన్ని ఆపాలని తొండంగి మండలంలో రైతులపై దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకొవాలని కోరుతూ...**

తూర్పుగోదావరి జిల్లా తొండంగి మండలం పంపాది పేట మరియు చుట్టు ప్రక్కల నాలుగు గ్రామాల ప్రజలు సమీపంలోని సముద్ర తీరప్రాంతంలో సర్వీ, జీడిమామిడి తోటలు, హేచరీలలోను పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు.

ఈ ప్రాంతంలోని పంపాదిపేట, కొత్తపాకల, తాటియాకులపాలెం గ్రామాల్లో దీవిస్ లేబరేటరీస్ లిమిటెడ్ ఫార్మాస్యూటికల్స్ కంపెనీ ఫ్యాక్టరీ నిర్మించడానికి అనుమతించారు. దీనికి ప్రభుత్వం ఏపిఐఐసి ద్వారా య.670.5 (హెక్టార్లు 271.34) భూమిని సేకరించి ఇవ్వడానికి ఉత్తర్వులు జారీ చేసింది. తూర్పుగోదావరి జిల్లా కలెక్టరు ఆధ్వర్యంలో భూసేకరణ కోసం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో సమీప గ్రామాల ప్రజలందరూ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వ్యతిరేకించారు. ఆ గ్రామాలకు సంబంధం లేని వారిని తీసుకువచ్చి వారి అభిప్రాయాలను సేకరించటమే గాక పోలీసులు, అధికారులు అంతు చూస్తామని రైతులను బెదిరించారు.

ఫ్యాక్టరీని ఆ ప్రాంతంలో నిర్మించినట్లైతే జల, వాయు కాలుష్యం వల్ల అక్కడి ప్రజలు వారి భవిష్యత్ తరాల ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుందని ప్రజలు భయభ్రాంతులవుతున్నారు. భూగర్భ, సముద్ర జలాల కాలుష్యం మూలంగా జలచరాలు నాశనం అవుతాయి. వాయు కాలుష్యం వల్ల హెచరీస్ మూతబడి వేలమందికి ఉపాధి పోతుంది. ప్రజలు ఎంత మొరపెట్టుకుంటున్నా ప్రభుత్వ అధికారులు దీవీస్ కంపెనీకే సహకరిస్తున్నారు. అంతే కాకుండా ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించకుండానే భూములను కంపెనీ వారికి ధారాదత్తం చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

దీనిపై హైకోర్టు స్టేటస్‌కో ఆర్డర్ ఇచ్చినా దీవిస్ కంపెనీ ఆ భూమిని ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపడుతుంది. 29.08.2016న ఆప్రాంతంలో పని చేయడానికి వచ్చిన యాజమాన్యాన్ని రైతులు ప్రశ్నిస్తుంటే తుని రూరల్ సిఐ చెన్నకేశవరావు నేతృత్వంలో సుమారు 70 మంది పోలీసులు అక్కడికి చేరుకుని అకారణంగా రైతులపై లాఠీ చార్జి చేశారు. మహిళలను కూడా మగ పోలీసులే విపరీతంగా కొట్టారు. గాయాలపాలైన కొందరు తుని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రైతులపై అక్రమ కేసులు బనాయించి తీవ్ర ఇబ్బందులకి గురిచేస్తున్నారు.

ఏ విధమైన అనుమతులు పొందకుండా దీవిస్ కంపెనీ అక్రమంగా నిర్మాణం చేపడుతుంటే వారికి కొమ్ముకాస్తూ శాంతి యుతంగా నిరసన తెలుపుతున్న రైతులపై పోలీస్ వారు దాడి చేయడం అన్యాయం. చట్ట వ్యతిరేకంగా ఫ్యాక్టరీ వారికి కొమ్ముకాస్తున్న పోలీసు అధికారులు మరియు రెవెన్యూ అధికారులపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము. ఆ ప్రాంతంలోని రైతుల జీవనోపాధిని దెబ్బతీసే రసాయనిక ఫ్యాక్టరీ నిర్మాణం ఆపాలని కోరుతున్నాం.

**అభివందనములతో...**

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి